చీమకుర్తిలో పలు సేవా కార్యక్రమాలు

చీమకుర్తి: పట్టణంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా పాటిమీదపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. నిరుపేదల ఇళ్ల నిర్మాణాలకు సిమెంట్ బస్తాలు అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదల కోసం మందుల కొనుగోళ్లకు ఆర్థిక సాయం అందించారు. సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకత్వం నిర్వహిస్తున్న కోటేశ్వరశర్మ దంపతులు, అభయ సేవా ఫౌండేషన్ ద్వారా సేవలందిస్తున్న మద్దాలి మాధవరావు దంపతులు, బధిరుల పాఠశాలలో సేవలందిస్తున్న కరస్పాండెంట్ అంజిరెడ్డి దంపతులను శిద్దా రాఘవరావు దంపతులు ఘనంగా సత్కరించారు. తొలుత చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో శిద్దా రాఘవరావు దంపతులు సకల దేవతలకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతితో పాటు వారి కుమారుడు శిద్దా సుధీర్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. గోల్డెన్, జ్యోతి గ్రానైట్ క్వారీల తరపున మేనేజర్ గిరిబాబుతో పాటు వారి సిబ్బంది ఆధ్వర్యంలో శిద్దా దంపతులను గజమాలలు, శాలువాలు కప్పి సత్కరించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఒంగోలు, చీమకుర్తి, మార్కాపురానికి చెందిన పలువురు పారిశ్రామికవేత్తలతో పాటు స్థానిక నాయకులు శిద్దా దంపతులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు

మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ

నాగులుప్పలపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ, బీఆర్ అంబేద్కర్, జ్యోతీరావుఫూలే, ఏకలవ్యుడు, బాబూ జగ్జీవన్‌రామ్, మౌలానా అబుల్‌కలాం, టంగుటూరి ప్రకాశం పంతులు, గురు రవిదాస్ విగ్రహాలను శనివారం స్థానిక ఎమ్మెల్యే విజయ్‌కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నలమలపు కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.




విద్యాభివృద్ధిలో ఒంగోలు

ఒంగోలు సిటీ:

ఒంగోలు నగరం విద్యాకేంద్రంగా మారుతోంది. మెడికల్ కళాశాల, ట్రిపుల్ ఐటీ, ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంతో పాటు నగరం చుట్టూ పదికిపైగా ఇంజినీరింగ్ కళాశాలలు విద్యార్థులకు మంచి అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. ఒకప్పుడు ఉన్నత చదువులు చదవాలంటే పక్క నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి నుంచి పక్క జిల్లాల వారు సైతం ఇక్కడకు వచ్చి విద్యనభ్యసిస్తూ విద్యారంగానికి కేరాఫ్ అడ్రస్‌గా ఒంగోలు నగరం మారుతోంది. రవాణా వసతులు మెరుగుపడటంతో ఇతర ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి ఇక్కడ చదువుకుంటున్నారు. అత్యాధునిక వసతులు, పలు పేరొందిన ప్రైవేటు విద్యాసంస్థలు సైతం అందుబాటులోకి రావడంతో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. పది ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకులు సాధించి ప్రతిభ చాటుతున్నారు. అలాగే పలు సీబీఎస్ఈలో కూడా జాతీయ స్థాయిలో మంచి గ్రేడ్‌లు సాధించి దీటుగా నిలుస్తున్నారు.

ఒంగోలులోని ఆంధ్రా హైస్కూల్, అపెక్స్ హైస్కూల్, శ్రీరామ్ కాన్సెప్ట్ హైస్కూల్, ఎస్.ఆర్.హైస్కూల్, నిర్మల హైస్కూల్, గౌతమ్ మోడల్ స్కూల్, శ్రీసాయి సంస్కృతి స్కూల్, శ్రీ సూర్య హైస్కూల్ విద్యార్థులు ఏడో తరగతి, పదో తరగతి, సీబీఎస్ఈలో పది, ప్లస్ వన్, ప్లస్‌టూల్లో మంచి ఫలితాలు సాధించారు. అత్యాధునిక విద్యా బోధనా పద్ధతులు, ఒలింపియాడ్, సీసీఈ, లుసిడా హ్యాండ్ రైటింగ్ శిక్షణ, ఐఐటీ అండ్ మెడికల్ ఫౌండేషన్‌లో శిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ, లైబ్రరీ, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్స్, సీసీ కెమెరాల పర్యవేక్షణ తదితర అత్యాధునిక సాంకేతిక వసతులు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో డిజిటల్ క్లాస్‌రూమ్స్, రోబోటిక్ వర్క్‌షాపు, మెమరీ ట్రైనింగ్, ఐఐటీ, నీట్, సివిల్స్ ఫౌండేషన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తూ విద్యారంగంలో కొత్త ఒరవడితో అద్భుత ఫలితాలు, అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. విద్యార్థులకు సౌకర్యవంతమైన హాస్టళ్లు, బస్సు సౌకర్యం కల్పిస్తూ అద్భుత ఫలితాలు రాబడుతున్నారు. పోటీ పరీక్షలకు సైతం విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లోనూ మంచి శిక్షణ ఇస్తున్నారు. క్రీడా సదుపాయాలు అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు.



ఒంగోలు నగరం వ్యూ



సమ్మర్ క్యాంపులో విద్యార్థుల సత్తా



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: విద్యార్థులకు నిర్వహించిన సమ్మర్ క్యాంపు ఎంతగానో ఉపయోగపడుతుందని ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు అన్నారు. ఆర్ఎస్ఆర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకుడు చిక్కాల కిరణ్ కుమార్ నేతృత్వంలో ఒంగోలు డీఆర్ఆర్ఎం హైస్కూల్లో విద్యార్థులకు ఉచితంగా నిర్వహించిన సమ్మర్ క్యాంపు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆటల పోటీల్లో సత్తా చాటి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. మారెళ్ల సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా వారిలోని సృజనాత్మకతను బయటకు తీసేందుకు సెల్ఫ్ డిఫెన్స్, సైన్స్ ప్రయోగాలు, మిచ్చస్ మార్షల్ ఆర్ట్స్, డైనమిక్ ఫిట్నెస్‌తో పాటు ఆటలు, యోగా నేర్పించడం, మహనీయుల జీవితాలను పరిచయం చేయడం గొప్ప విషయమని అన్నారు. కార్యక్రమంలో అసిస్ట్ డిప్యూటీ డైరెక్టర్ వడ్డేంపూడి సుజాతరావు, సేవ్ ది యానిమల్ ఫౌండేషన్ ప్రతినిధులు తాడిపత్రి దివ్య, కోసూరి శ్రీదేవి, మండవ సుబ్బారావు, గోపి, ఏడుకొండలు, మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్

ఒంగోలు సిటీ: డీఈఈ సెట్ 2025కు సంబంధించిన ప్రవేశ పరీక్షను జూన్ 2వ తేదీ సోమవారం నిర్వహించనున్నట్లు ఎస్ఎస్‌సీ అసిస్టెంట్ కమిషనర్ శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ ద చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా, మామిడిపాలెం అలాగే రైజ్ క్రిష్ణ సాయి ప్రకాశం గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఒంగోలులో మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్షకు హాజరైన విద్యార్థులు ఒక గంట ముందుగా సెంటరుకు చేరుకోవాల్సిందిగా కోరారు

అంజనీ పుత్రునికి ఆకు పూజలు

ఒంగోలు మెట్రో: నగరంలోని శ్రీరామదూత ఆంజనేయ స్వామి ఆలయాలలో శనివారం ఆకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న అభయాంజనేయస్వామికి, లాయర్‌పేట రైతు బజార్ వద్ద చిట్టి ఆంజనేయస్వామి మందిరంలో, గద్దలగుంట ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం, సంతపేట వీరాంజనేయస్వామి దేవస్థానం, మంగమూరుడొంక హరిహరక్షేత్ర అయ్యప్పస్వామి దేవస్థానంలో ఉపాలయంగా ఉన్న ఆంజనేయస్వామికి, కేశవస్వామిపేటలోని వీరాంజనేయస్వామి దేవస్థానంలో, నెహ్రూనగర్‌లోని అభయాంజనేయస్వామికి, మంగమూరు డొంక మర్రిచెట్టుకాలనీ వద్ద పొలిమేర అభయాంజనేయస్వామి దేవస్థానంలో పూజలు చేశారు.



ఆకుపూజ అందుకుంటున్న అభయాంజనేయస్వామి